వాయుసేన ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం సిటీ: భారత ప్రభుత్వానికి చెందిన సికింద్రాబాద్ కమాండింగ్ ఆఫీసర్, అగ్నిపథ్ వాయు కంబాటెంట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 2005 జూలై రెండో తేదీ నుంచి 2009 జనవరి రెండో తేదీ మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఇంటర్మీడియట్, డిప్లమో (పాలిటెక్నిక్), ఇంటర్మీడియట్ ఒకేషనల్‌లో 50 శాతం, ఇంగ్లీష్ సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉన్న వారు అర్హులని స్పష్టం చేశారు. ఈనెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు https://airmenselection.cdac.in, https://agnipatvayu.cdac.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. యువత ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధరల బోర్డుతో దోపిడీ ఆగుతుందా?

ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు, లేబొరేటరీలు పలురకాల వైద్య సేవలు, పరీక్షలు, శస్త్రచికిత్సలకు వారు నిర్ణయించిందే ధరగా ఉంది. రోగులను డిశ్చార్జి చేసిన తర్వాత కుటుంబసభ్యుల చేతిలో పెడుతున్న బిల్లులు చూసి షాక్‌కు గురవుతున్న పరిస్థితి నెలకొని ఉంది. ఇక స్కానింగ్, రక్త పరీక్షలు, చివరకు ఒపి టోకెన్ ధరలకూ అడ్డే లేకుండా పోయింది. ఫీజుల నియంత్రణకు చట్టం చేసి ఇటువంటి వాటిని ప్రభుత్వమే కట్టడి చేయాల్సి ఉంది. అది మానేసి ఏ చికిత్సకు ఎంత వసూలు చేస్తారనే వివరాలు రిసెప్షన్ కౌంటర్ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలంటూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం విమర్శలకు తావిస్తోంది. ఫీజులు వసూలు చేసిన వారికి బోర్డులు పెట్టడానికి ఇబ్బందేం ఉంటుందని, ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు ఏం మేలు చేకూరుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓ ఆసుపత్రిలో వేచి చూస్తున్న రోగులు, కుటుంబ సభ్యులు (ఫైల్)

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇష్టానుసారంగా ఒపి రేట్లు
- పలురకాల పరీక్షల పేరుతో అధిక రుసుముల వసూలు
- నియంత్రణ చర్యలను విస్మరించిన ప్రభుత్వం
- బోర్డులు ఏర్పాటు చేయాలంటూ వైద్యారోగ్యశాఖ తాజాగా ఉత్తర్వులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డెంటల్, పోలీక్లినిక్‌లు, ల్యాబ్‌లు కలిపి మొత్తం 435 ఉన్నాయి. వీటిలో ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు 172 ఉన్నాయి. డెంటల్ ఆస్పత్రులు 59 ఉన్నాయి. లేబొరేటరీలు 110, అత్యున్నత పరికరాలతో ఉన్న లేబొరేటరీలు 13, ఫిజియోథెరఫీలు ఆరు ఉన్నాయి. క్లినిక్‌లు 49, పోలీ క్లినిక్‌లు 26 ఉన్నాయి. వైద్య పర్యవేక్షణ బాగుంటుందనో, అన్ని సౌకర్యాలు ఉంటాయనో వంటి కారణాలతో ఎక్కువ శాతం మంది రోగులు, వారి బంధువులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు గిరాకీ పెరుగుతోంది. తమ వారి ప్రాణాలను కాపాడుకోవాలనే ఆందోళనతో అప్పులు చేసి ఎంత డబ్బులైనా వెచ్చించేందుకు సిద్ధమవుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు ఇష్టానుసారంగా ఒపి రేట్లను పెంచేస్తున్నాయి. ఇప్పుడు దాదాపు అన్ని ఆస్పత్రుల్లో రూ.500 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తున్నాయి. ఒపి ఫైల్ కోసం అదనంగా మరో రూ.50 వసూలు చేస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులన్నింటిలోనూ ఇవే ఒపి ధరలు ఉన్నాయి.

ఆస్పత్రిలో చేరితే అప్పలపాలే...

ఒపి ధరలు ఇలా ఉంటే ఆస్పత్రిలో అడ్మిట్ అయిన వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. రోగుల నుంచి రకరకాల పేర్లతో అడ్డగోలుగా డబ్బులను వసూలు చేస్తున్నాయి. ఆస్పత్రిలో చేరిన రోగి కోలుకునే వరకు అతని బాధ్యతను సంబంధిత వైద్యుడే చూసుకోవాల్సి ఉండగా, రౌండ్ల పేరుతో రూ.500 వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా డ్యూటీ డాక్టర్ ఫీజు అని, నర్సింగ్ ఛార్జీలు ఇలా రకరకాల పేర్లతో డబ్బులను గుంజుతున్నారు. ఐసియులో చేరిన రోగుల బంధువుల పరిస్థితి అయితే వేరే చెప్పనక్కర్లేదు. ఒక్కో ఆస్పత్రిలో ఐసియు ఛార్జీలను రూ.ఐదు వేల వరకు వసూలు చేస్తున్నారు. 24 గంటలకోసారి రోగి బంధువులతో అడ్వాన్స్‌గా డబ్బులు కట్టించుకుని, ఆ తర్వాత చాంతాడులా ఫీజుల జాబితాను రోగుల బంధువుల చేతిలో పెడుతున్నారు. రోగికి ఐసియు వార్డులో ఉంచాల్సిన అవసరం లేకున్నా, కొన్ని ఆస్పత్రులు అధిక సొమ్ముల కోసం అదనపు రోజులు అందులోనే ఉంచుతున్న పరిస్థితి నెలకొంది.

బోర్డుల ఏర్పాటుపై పర్యవేక్షణకు అధికారులు

ప్రైవేట్ ఆస్పత్రులు, లేబొరేటరీలు తదితర విభాగాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఆరుగురు ప్రోగ్రామ్ అధికారులను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత నియమించారు. వారే ధరల బోర్డు అంశాన్ని పరిశీలించనున్నారు. వారిలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఆర్.రామదాస్, నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల విభాగం పర్యవేక్షకులు వెంకట్, డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేథరిన్, డిపిఎంఒ రవీంద్ర, ఆరోగ్య శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రకాశరావు తదితర ప్రోగ్రామ్ అధికారులు త్వరలో ఆస్పత్రులను సందర్శించనున్నారు.

ధరల బోర్డు ఏర్పాటు చేయకుంటే చర్యలు

జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లు నిర్వహిస్తున్న యాజమాన్యాలు ప్రజలకు తెలిసే విధంగా సేవల ధరల వివరాల బోర్డును తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2002 రూల్ 2007, 2009 ప్రకారం రేట్ల వివరాలను తెలుగు, ఆంగ్ల భాషలో రోగుల ప్రయోజనం కోసం రిసెప్షన్ కౌంటర్ వద్ద కనిపించేలా ఉంచాలి. ఏటా జూలై ఒకటో తేదీన సేవల ధరల్లో సవరణలు ఉంటే సరిచేసి, జాబితాను రిసెప్షన్ కౌంటర్‌లో ప్రదర్శించడంతో పాటు ఒక ప్రతిని వారం రోజుల్లోగా జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలి. లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవు. **- కె.అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి**

ఎవరి ప్రయోజనాల కోసం కొత్త డిపో

- ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో విడదీస్తే సహించేది లేదు
- వామపక్ష, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు
- కలెక్టర్‌కు మహా రాయబారం

ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను ఎవరి ప్రయోజనాల కోసం విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేస్తున్నారో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమాధానం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.కృష్ణమూర్తి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీయొద్దని కోరుతూ వామపక్షాలు, ఉద్యోగ, కార్మిక, రైతు, మహిళా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్‌కు వెళ్లి అక్కడ గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో మహా రాయబారం నిర్వహించి, డిపో విడదీయొద్దని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు చేయడం వల్ల జిల్లా, ఆ ప్రాంత ప్రజలకు ఏమైనా ప్రయోజనం ఉందా అని ప్రశ్నించారు. ఎచ్చెర్లలో వంద మంది దళిత కుటుంబాలకు చెందిన నాలుగు ఎకరాల భూములను 1986లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని ఎచ్చెర్లలో యారక్ బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసి సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాలను కార్మికులు, హమాలీలుగా ఉపాధి కల్పించిందని తెలిపారు. అప్పటి ప్రభుత్వ సారా తయారీ నుంచి ఇప్పుడు ఎపి బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐఎంఎల్ డిపోగా నడుస్తున్న దీనిపై 350 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలో ఒక డిపోగా కొనసాగుతున్న దాన్ని విడగొట్టి, కొత్తగా మరో డిపో ఏర్పాటు ఏర్పాటు అవసరం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల గోడౌన్‌కు ప్రభుత్వం అద్దె చెల్లించాలని, అదనపు సిబ్బందిని నియమించాలని నెలకు రూ.లక్షల్లో ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వ గోడౌన్ ఉండగా, అధిక మొత్తంలో అద్దెని చెల్లించి ప్రైవేటు గోడౌన్ టెక్కలిలో ఎందుకు పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఐఎంఎల్ డిపో కోసం కార్మిక కుటుంబాలు కోట్లాది రూపాయల విలువ చేసే భూమిని ఉచితంగా త్యాగం చేసి ఇచ్చారని, ఇప్పుడు డిపో తరలిపోవడం వల్ల కార్మిక కుటుంబాలు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటుకు ఇచ్చిన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలని, హమాలీల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు.హమాలీలు ఒంటరిగా లేరని జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, కార్మికులు వారి వెన్నంటి ఉన్నారని చెప్పారు. వారి పోరాటానికి వామపక్షాలు అండగా ఉంటాయని భరోసానిచ్చారు. దళితులు, పేదలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే డిపోను యధావిధిగా కొనసాగించాలని, ఎచ్చెర్లలోనే అవసరానికి తగ్గట్టు గోదాములు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, సిపిఐ జిల్లా నాయకులు సంతోష్, కార్మిక, రైతు, ప్రజాసంఘాల నాయకులు ఎం.గోవర్ధనరావు, కె.సూరయ్య, ఎల్.రామప్పడు, ఎం.రమణ తదితరులు కార్మికుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎపి బిసిఎల్ హమాలీస్ యూనియన్ నాయకులు నిడిగంట్ల రమణ, జి.శ్రీనివాసరావు, ఎల్.సీతారాం, లండ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక అవుట్‌పోస్టుకు టెండర్లు

శ్రీకాకుళం సిటీ: పొందూరు, మందసలో అగ్నిమాపక కార్యాలయాల అవుట్‌పోస్టుకు టెండర్లను కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో గురువారం తెరిచారు. తక్కువ కోట్ చేసిన టెండర్లను ఖరారు చేశారు. పొందూరు ఫైర్ అవుట్‌పోస్టుకు ఆరు దరఖాస్తులు రాగా, మందస అవుట్‌పోస్టుకు మూడు దరఖాస్తులు వచ్చాయి. ఇందులో పొందూరు అవుట్‌పోస్టు నిర్వహణకు జి.శ్రీనివాసరావు రూ.15.50 లక్షలు, కె.సూర్యనారాయణ రూ.16.80 లక్షలు, సిహెచ్.రామ్మోహనరావు రూ.16.90 లక్షలు, బి.అనంతరావు రూ.15.76 లక్షలు, సెబీర్ బేగం రూ.17.89 లక్షలు, ఎ.సూర్యప్రకాశరావు రూ.20 లక్షలకు టెండర్లు వచ్చాయి. ఇందులో అవుట్‌పోస్టు నిర్వహణ తక్కువగా ఉన్న జి.శ్రీనివాసరావు పేరును ఖరారు చేశారు. మందస అవుట్‌పోస్టు నిర్వహణకు జి.ఇందుమతి రూ.16 లక్షలు, కె.సూర్యనారాయణ రూ.17.50 లక్షలు, పి.కృష్ణారావు రూ.19.71 లక్షలకు దరఖాస్తులు రాగా, ఇందులో అవుట్‌పోస్టు నిర్వహణ తక్కువగా ఉన్న జి.ఇందుమతి పేరును ఖరారు చేశారు. ఐదేళ్ల అవుట్‌పోస్టు నిర్వహణ అంతా టెండర్లు ఖరారు చేసిన వారే చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి జె.మోహనరావు, అటవీ శాఖ సబ్ డిఎఫ్ఒ నాగేంద్ర, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

టెండర్ల ఖరారు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

27 వరకు జిల్లాలో వర్షాలు

- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రస్తుత వాతావరణ స్థితిగతులపై రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ జారీ చేసిన ప్రత్యేక బులెటిన్‌ను ఆయన జిల్లా అధికారులకు చేరవేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకూ తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. 24, 25 తేదీల్లో కొద్దిచోట్ల అతి భారీ వర్షాలు నమోదు కావచ్చని చెప్పారు. ఇప్పటికే సముద్రంలో గాలుల వేగం గంటకు 65 కిలోమీటర్ల వరకు పెరిగే అవకాశం ఉండటంతో మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకూడదని హెచ్చరించారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం కవిటి వరకూ తీరంలో 3.0 నుంచి 3.8 మీటర్ల వరకూ అలలు ఎగసిపడే అవకాశం ఉందన్నారు. తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తాత్కాలిక బస కేంద్రాలు సిద్ధం చేయాలని సంబంధిత తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి మండలంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, విద్యుత్, ఆరోగ్య శాఖల సమన్వయంతో నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పాతపట్నం, కొత్తూరు, ఇచ్ఛాపురం, కవిటి, నందిగాం, సంతబొమ్మాళి, గార మండలాల్లో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తుల సందర్భంలో స్పందన కోసం రాష్ట్ర ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా 112, 1070, 18004250101 నంబర్లకు గానీ seoc-apsdma@ap.gov.in మెయిల్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగ సూచనలను కచ్చితంగా పాటించాలని కోరారు.

కంట్రోల్‌రూమ్‌లో అధికారులు

ఎరువులపై కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో ఎరువుల సరఫరా, వినియోగంపై కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నియంత్రణ విభాగంలో ఈ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథస్వామి తెలిపారు. ఎరువుల లభ్యత, ఇతర సంబంధిత సమాచారం కోసం రైతులు 9121863788 ఫోన్ నంబరును సంప్రదించవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో సరిపడినంత ఎరువుల నిల్వలున్నాయని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అవసరానికి మించి ఎరువులను వినియోగించడం వల్ల నేల సారం తగ్గడంతో పాటు దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని, రైతులు ఆ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు సమస్యలు, సలహాలు కోసం కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించాలని సూచించారు.

పలాస కిడ్నీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

అజశర్మ

ప్రజాశక్తి - పలాస

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రతను దృష్టిలో పలాస కిడ్నీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. ఈమేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు లేఖ రాశారు. గత ప్రభుత్వం 2019 సెప్టెంబరు 3వ తేదీన 102 జిఒ జారీ చేస్తూ పలాసలో సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం, రీసెర్చ్ సెంటర్, డయాలసిస్ కేంద్రం వంటివి ఏర్పాటు చేస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. నిర్మాణం పూర్తయి, వైద్య సేవలు ప్రారంభించినా, ఇంకా సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని తెలిపారు. 102, 87 జిఒల ఆధారంగా వైద్యుల పోస్టుల సంఖ్య మొత్తం 60గా పేర్కొన్నా, 20 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. అందులోనూ ఇద్దరు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా 40 వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 60 మంది నర్సులకు గానూ 58 మంది కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నారని, శాశ్వత నర్సులు ఎవరూ లేరని తెలిపారు. ఎనిమిది మంది రీసెర్చ్ సిబ్బందితో జరగాల్సిన రీసెర్చ్ పూర్తిస్థాయిలో నడవడం లేదన్నారు. 18 మంది టెక్నీషియన్లకు గానూ కేవలం పది మంది మాత్రమే, అదీ కాంట్రాక్టు పద్ధతిలోనే ఉన్నారని తెలిపారు. నెఫ్రో ప్లస్ అనే ప్రైవేటు సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న డయాలసిస్ కేంద్రంలో పూర్తిగా అందుబాటులో ఉండే ప్రత్యేక నెఫ్రాలజిస్టు లేరని చెప్పారు. వంద పడకల ఆస్పత్రిగా ఉన్నా పూర్తిగా పడకలు లేవని, వాస్తవంగా 200 పడకల ఆస్పత్రి అని తెలిపారు. వ్యాధి తీవ్రతను బట్టి రూ.ఐదు, పది వేలు రోగులకు చెల్లిస్తామని చెప్పినా, సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కిడ్నీ రోగుల సంఖ్య, మరణాల సంఖ్య పెరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన జిఒల పూర్తి అమలుకు సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కిడ్నీ ఆస్పత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది, వైద్యులు, తగినంత మంది నెఫ్రాలజిస్టులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని కోరారు. అన్ని స్పెషలిస్టు సేవలు అందుబాటులోకి తేవాలని, పరిశోధనా కేంద్రం అంతర్జాతీయ నిపుణుల సహకారంతో పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నిర్దిష్ట గడువులోగా పరిశోధన పూర్తయి, వ్యాధికి గల కారణాలను నిర్ధారించేలా చర్యలు చేపట్టాలన్నారు. డయాలసిస్ రోగులకు ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని, డయాలసిస్ సమయంలో ఇస్తున్న విలువైన మందులు రోగికి కానీ, రోగి సహాయకులకు గానీ చూపించేలా ఆదేశించాలన్నారు. రోగులతో పాటు సహాయకులకూ మూడు పూటలా ఆహారం సరఫరా చేయాలని కోరారు. ప్రధాన రోడ్డు వద్ద రోగులు బస్సు, ఆటోల కోసం వేచి ఉండడానికి బస్ షెల్టర్ నిర్మించి, అక్కడ నుంచి ఆస్పత్రికి రోగులు వచ్చి వెళ్లేందుకు ఎలక్ట్రిక్ వాహనం ఏర్పాటు చేయాలన్నారు.

ఇదేం విచారణ?

- మూడు నెలల తర్వాత మేల్కొన్న ప్రభుత్వం
- పదో తరగతి పరీక్షల ఘటనపై ఈనెల 28న విచారణ
- డిఇఒ తిరుమల చైతన్య ఈనెల 31న ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, సిటీ

మూడు నెలల తర్వాత ప్రభుత్వం మేల్కొంది. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఉద్యోగ విరమణకు మూడు రోజుల ముందు విచారణకు సిద్ధమైంది. ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో పదో తరగతి పరీక్షల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై ఈనెల 28న విచారణ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ కె.వి శ్రీనివాసులు రెడ్డిని విచారణ అధికారిగా నియమించింది. శ్రీకాకుళం నగరంలోని సమగ్ర శిక్ష అభియాన్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు విచారణ చేపట్టనున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య, ఎచ్చెర్ల మండలం కుప్పిలి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మ కుమారిని విచారణకు హాజరు కావాలంటూ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. దీనిపై ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుప్పిలి మోడల్ స్కూల్, హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణలో అవకతవకలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో డిఇఒ తిరుమల చైతన్య 14 మందిపై సస్పెన్షన్ వేటు విధించారు. ఐదుగురు విద్యార్థులను డిబార్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన ఉపాధ్యాయులు తిరగబడ్డారు. పలురూపాల్లో ఆందోళనలు చేపట్టారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. తర్వాత పలు దశల్లో అందరిపైనే సస్పెన్షన్ తొలగించారు. ఇప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులపై ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసులు అలానే ఉన్నాయి. డిఇఒ తిరుమల చైతన్య నిరంకుశ వైఖరి, విద్యార్థులకు జరిగిన నష్టంపై విచారణ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పుడు మేల్కొన్న ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు తీరిగ్గా ఈనెల 28న విచారణకు వస్తున్నారు. వాస్తవానికి డిఇఒ తిరుమల చైతన్య ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఉద్యోగ విరమణకు మూడు రోజుల ముందు విచారణ చేపట్టడంలో ఉద్దేశమేమిటని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

జాషువా రచనలు సామాజిక చైతన్య గీతికలు

రచయిత డా. బండి సత్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల గుర్రం జాషువా రచనలు ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఎంతగానో దోహదపడతాయని ఆకాశవాణి కేంద్రం (విశాఖపట్నం) వ్యాఖ్యాత, రచయిత డాక్టర్ బండి సత్యనారాయణ అన్నారు. నగరంలోని స్థానిక కేంద్ర గ్రంథాలయంలో ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అధ్యక్షతన జాషువా వర్ధంతి సభను గురువారం నిర్వహించారు. కథానిలయం ట్రస్టు కార్యదర్శి దాసరి రామచంద్రరావు, రచయిత, పాతపట్నం ఎంఇఒ చింతాడ తిరుమలరావు, తెలుగు అధ్యాపకులు బాడాన శ్యామలరావు (తామాడ), రచయిత కలమట దాసుబాబు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె.శ్రీనివాసరావు జాషువా రచనలు, ఆనాటి సమాజంపై చూపిన ప్రభావంపై వివరించారు. జాషువా రచనలు ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టు ఏవిధంగా ఉన్నాయో వక్తలు విశదీకరించారు. శ్రీకాకుళం సాహితీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి సుధాకర్, ప్రజా సాహితీ కార్యదర్శి పి.మోహనరావు, యువ రచయితల వేదిక అధ్యక్షులు తంగి ఎర్రమ్మ, రచయిత కె.భుజంగరావు, సన్ డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు భానుప్రసాద్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుంచి డా. కె.ఉదయ్ కిరణ్, డా.లీలావరప్రసాద్, విశ్వసాహితీ అధ్యక్షులు పొన్నాడ వరాహనరసింహులు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కళాకారుడు రామచంద్రరావు పలు అభ్యుదయ గేయాలను ఆలపించారు.

సభలో మాట్లాడుతున్న అట్టాడ అప్పలనాయుడు

రేపు ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఆగస్టులో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నమెంట్ కోసం ఈనెల 26 తేదీన ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్అండ్‌బి బంగ్లా మైదానంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంలో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 73869565 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

మెరిట్ సర్టిఫికేట్ అందజేత

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో గతేడాది నిర్వహించిన జిజియా భాయి నేషనల్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారిణి రుప్ప పుష్పలతకు మెరిట్ సర్టిఫికెట్ అందజేశారు. ఆమెకు జిల్లా అసోసియేషన్ తరుపున అభినందనలు తెలిపారు.

మెరిట్ సర్టిఫికేట్‌ను అందజేస్తున్న శ్రీనివాసరావు

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి నరసన్నపేట వారి కోర్టులో
O.S.No: 14/2025

Between:-
నంభాళ్ళ సత్యన్నారాయణ ---వాది
And:-
దూగాన జగదీశ్వరరావు ---ప్రతివాది

To,
దూగాన జగదీశ్వరరావు, S/o మల్లేశ్వర రావు, ఉద్యోగం వృత్తి, R/o D.No: 1-24-120, రెండవ లైన్, భావాజీ నగర్, గవర్నమెంటు హాస్పిటల్ జంక్షన్, బలగ, శ్రీకాకుళం టౌన్ మరియు జిల్లా.

నోటీసు

పై నెంబరు గల దావా, వాది దగ్గర మీరు వాడుకున్న మొత్తమును వడ్డీతో సహా రాబట్టే నిమిత్తం, నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో వాదనను మీపై దఖలు చేయగా, మీ యొక్క హాజరు నిమితం **తే. 04-08-2025 దీ నాడు వాయిదా వున్నది.** కావున ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడం అయినది. అందువలన వాయిదా రోజున మీరు వ్యక్తిగతంగా గాని, వకీలు ద్వారా గాని పైన పేర్కొన బడిన కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు. మీకు గల ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేయగలరు. లేని యెడల మీకు Ex-Parte చేసి వాదికి అనుకూలంగా తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

నరసన్నపేట:
తేది: 24-07-2025
రెడ్డి జగన్నాధరావు
న్యాయవాది, నరసన్నపేట.

రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పద్మలత

కెజిబివిలో ఆరోపణలపై విచారణ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని లోలుగు కెజిబివి ప్రిన్సిపాల్ సౌమ్యపై ఆ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ కిరణ్‌కుమారి, వైస్ చైర్మన్ పారంనాయుడులు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం డిప్యూటీ కలెక్టర్ పద్మలత విచారణ చేశారు. పాఠశాలలో జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విచారణకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న గాంధీ

పిఎసిఎస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

కొత్తూరు: పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నియామక పత్రాన్ని ఎమ్మెల్యే ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అందజేశారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దువ్వాడ సూర్య నారాయణ, వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీ వరప్రసాదరావు, మండల పార్టీ కన్వీనర్ అగతముడి మాధవరావు, టిడిపి నాయకులు ఎ.భైరాగినాయుడు, అరుణ్‌కుమార్, పి.మోహనరావు, చోడవరపు రాము, ఎ.దశరథ, ఎల్.లక్ష్మీనారాయణ నాయుడు, గోగుల్ వరప్రసాదరావు నాయుడు, టి.తిరుపతిరావు, సిఇఒ పొత్తరకొండ నాగరాజు పాల్గొన్నారు.

ఎపిఎంపై అసహనం వ్యక్తం చేస్తున్న జామిదార్ సాబ్

రికార్డుల నిర్వహణపై అసంతృప్తి

కొత్తూరు: మండలి మహిళా సమాఖ్యలో స్త్రీనిధి, సిబ్బంది, పొదుపు సంఘాల నెలవారీ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఢిల్లీ మానిటరింగ్ టీమ్ సభ్యులు జామిదార్ సాబ్ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయం వద్ద ఎంపిడిఒ నీరజ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా టీమ్ సభ్యులు ఎన్.ఎస్.రాథోడ్, ఝామీ దార్‌షాబ్‌లు గ్రామీణ ఉపాధి, హౌసింగ్, వెలుగు కార్యాలయ రికార్డులను పరిశీలించి గ్రామసభకు వచ్చిన వారిని అమలవుతున్న పథకాలను సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ బి.సుధాకరరావు, ఎపిడి పి.రాధ, సిబి సరిత, వైస్ ఎంపిపి లోతుగడ్డ తులసీవరప్రసాదరావు, సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు, ఎపిఎం లలిత, ఎఇ దుర్గాప్రసాద్, హౌసింగ్ ఎఇ మోహనరావు, ఎపిఒ ప్రేమలత, వెటర్నరీ వైద్యులు హరికృష్ణ, ఎఒ ఎస్.స్వర్ణలత, టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ నాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ లోతుగడ్డ శ్రీను పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

టెక్కలి రూరల్ : నెల్లూరు, చిత్తూరు జిల్లా నుంచి తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు రేణిగుంట రైల్వేస్టేషన్ కేంద్రంగా యూరియా అక్రమ మార్గాల్లో తరలింపుపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని నీటి సంఘం మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో కోరారు. శ్రీకాకుళం రైల్వేస్టేషన్ నుంచి ఒడిశాకు తరలిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవు తున్నాయని విమర్శించారు. జిల్లాలో రైతులకు యూరియా, డిఎపి అందక ప్రయివేటున ఎక్కువ రేట్లకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ ఇప్పటికీ అందకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్య ప్రతినిధులు

సంస్కార భారతి విద్యార్థుల ప్రతిభ

సోంపేట: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ డిగ్రీ 4వ సెమిస్టర్ ఫలితాల్లో సంస్కార భారతి డిగ్రీ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని చైర్మన్ దేవరాజు తెలిపారు. గురువారం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. కాకర్ల వైష్ణవి 9.39, వజ్జ పల్లవి 9.25, గురుగు కుష్మ అంజలి 9.11, మల్లాడ లావణ్య 9.11, చీరాపు షర్మిల 9.07, దుద్ది కల్పన 9.00, కల్లపల్లి జ్ఞానేశ్వరరావు 9.00 అత్యధిక మార్కులు సాధించినట్లు తెలిపారు. చైర్మన్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్.దాసు అభినందించారు.

29లోగా దరఖాస్తులు చేసుకోవాలి

రణస్థలం: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు విద్యార్థులు ఈనెల 29లోపు ధరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ప్రవేశపరీక్షకు దరఖాస్తులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో తరగతి విద్యార్థులందరూ నవోదయ ప్రవేశ పరీక్ష రాసేలా చూడాలని హెచ్ఎంలను ఆదేశించారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

బూర్జ: ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గ్రామాల్లో ఉన్న రైతులకు అన్నివేళల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని మండల ఎఒ దుంపల ఉషారాణి గ్రామీణ వ్యవసాయ శాఖ అసిస్టెంట్‌కు సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలో వివిధ గ్రామాల విధుల్లోకి చేరిన విఎఎలకు సమీక్ష నిర్వహించారు. రైతులకు అవసరమైన సూచనలను, సలహాలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను, పథకాలను రైతులకు చేరవేయాల్సిన బాధ్యత వ్యవసాయశాఖ అసిస్టెంట్ల దేనన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎఒ ఉషారాణి

ఇసుక అక్రమ రీచ్‌లపై బహిరంగ చర్చకు సిద్ధమా?

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఇసుక అక్రమ రీచ్‌లపై బహిరంగ చర్చకు టిడిపి నాయకులు సిద్ధమా అని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని బొడ్డేపల్లి పేటలో నున్న వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాగావళి, వంశధార నదుల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై బహిరంగ చర్చకు వైసిపి సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. అయితే నది జలాలపై అవగాహన లేని టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు కాకుండా నియోజకవర్గ ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. నాగావళి నదిలో నిర్వహిస్తున్న ఇసుక అక్రమ తవ్వకాలపై వైసిపి తప్పుడు ప్రచారం చేస్తుందని బహిరంగ చర్చకు రావాలని టిడిపి నాయకులు విసిరిన సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని 10 ఇసుక ర్యాంపుల్లో ఐదు లేదా పది పైసలు వాటా ఉన్న చోటా నాయకులకు ఇసుకపై అవగాహన తక్కువని అందువలన పూర్తిస్థాయి అవగాహన ఉన్న నియోజకవర్గ నాయకుడితోనే తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. నదిలో మూడు మీటర్ల మేర ఇసుక మేటలు ఉంటాయని అందులో ఒక మీటరు ఇసుకనే తవ్వకాలు జరపాలని, అలాకాకుండా నిమ్మతొర్లాడ రేవు, చిత్తార పురం వద్ద చెరువు మాదిరి ఇసుక తవ్వకాలు జరిపారన్నారు. దీనివలన నది ప్రవాహ తీరం మారి భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని, ఇది పర్యావరణ పరిరక్షణకు ప్రమాదమన్నారు. వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్ మాట్లాడుతూ పదేపదే తమ నాయకుడు చింతాడ రవికుమార్‌ను కనీసం వార్డు మెంబరు, కౌన్సిలర్ కూడా గెలవలేని వ్యక్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగడం ఏమిటని టిడిపి నాయకులు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో చాలా మంది టిడిపి ఎమ్మెల్యేలు ఎటువంటి పదవుల్లో పోటీ చేయకుండా ఎమ్మెల్యేలు అయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, బెవర మల్లేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, దుంపల శ్యామ్, మామిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలతో నరకయాతన

మెళియాపుట్టి : గుంతలమయమైన రోడ్డు

పలాస : అధ్వానంగా ఉన్న రోడ్డు

మెళియాపుట్టి: మండలంలో పలుచోట్ల బిటి రోడ్లు గుంతలు ఏర్పడి నరకయాతనగా తయారవుతున్నాయి. ప్రభుత్వం ఆదేశాలతో కొన్నిచోట్ల గుంతలు పూడ్చినా మరికొన్ని చోట్ల పూడ్చక పోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గుంతలు పూడ్చిన చోట నాణ్యత లేక మళ్లీ పాడవుతున్నాయి. పట్టుపురం- చాపర దగ్గర ఇదే పరిస్థితి నెలకొంది. ఒడిశా సరిహద్దులోని మండల శివారు ప్రాంతమైన రంపకాన నుంచి గొప్పిలి మధ్య రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిండా గుంతలు ఏర్పడడంతో ఈ ప్రాంతపు ప్రజలు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే మెళియాపుట్టి, పెద్దపద్మపురం, ఆల్ ఆంధ్రా రోడ్డు దయానియంగా మారింది. అలాగే గోపీనాథపురం సమీపంలోనే కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆర్అండ్‌బి అధికారులు దృష్టి సారించి రోడ్డు గొంతులను సత్వరం పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పలాస : ఈ రోడ్డు ఎక్కడో కాదు మన పలాస నియోజక వర్గంలో పట్టణానికి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న తర్లాకోట పంచాయితీ. లొద్దభద్ర పంచాయతీ పరిధిలోని మహాదేవిపురం, పాత్రియ, బాపూనూరు, రఘునాథపురం, బాలజూరు, గట్టూరు, కొటారింగి తాళ్లభద్ర గిరిజన గ్రామాలకు వెళ్లే రోడ్డు చిన్న పాటి వర్షం కురిస్తే చాలా గిరిజనులు బయటికు వెళ్లలేని పరిస్థితి. బయట నుంచి గ్రామాల్లోకి వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోంది. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు కావస్తున్నా ఇప్పటికీ రోడ్డు లేకపోవడం బాధాకరం. ప్రభుత్వాలు మారినా రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదు. అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వెళ్లాలన్నా... విద్యార్థులు చదువు కోసం వెళ్లి రావాలన్నా. ఈ రోడ్డే గతి. నాయకులు, అధికారులు స్పందించి రోడ్డు సదుపాయం కల్పించాలని అల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు కోరుతున్నారు.

గవర్నర్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త బాలకృష్ణ

కెవికె శాస్త్రవేత్తకు అవార్డు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు పొందిన బాలకృష్ణను కెవికె కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మితో పాటు ఇతర శాస్త్రవేత్తలు అభినందించారు. ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా బాలకృష్ణ ఇటీవల ఈ అవార్డు అందుకున్నారు. ఆక్వాకల్చర్‌లో నూతన సాంకేతిక పద్ధతులను రైతులకు వివిధ విస్తరణ శిక్షణా కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించడం, చేపలు, రొయ్యల సాగులో వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి వాటి నివారణలో రైతులకు సహకార మత్స్య సహకార సంఘ సభ్యులకు అవగాహన కల్పించడం, జిల్లాలో చేపపిల్లల పెంపకాన్ని ప్రోత్సహించి పరిశోధనలు, ప్రముఖ జర్నల్‌లో పరిశోధన పత్రాల సమర్పించారు. వీటన్నింటినీ పరిగణించి ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపిక చేయడం జరిగిందని బాలకృష్ణ వివరించారు. కార్యక్రమంలో కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

నరసింహులు

కోళ్లు, మేకలు, గొర్రెలు, పశువుల యూనిట్లను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తుందని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్.నరసింహులు అన్నారు. గురువారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ జిల్లాలో డ్వాక్రా గ్రూపుల ద్వారా పశు గ్రాసాలకు లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. డివిజన్‌లో 21 మంది వైద్య పోస్టులు ఖాళీ ఉన్నారన్నారు. రెండు పంచాయతీలకు పదెకరాల చొప్పున పశుగ్రాసం కోసం ఉపాధి హామీ ద్వారా చేపడుతున్నట్లు తెలిపారు. సంతానోత్పత్తికి టీకా రూ.500 నుంచి రూ.150కి ప్రభుత్వం తగ్గించిందన్నారు. ఈ టీకా మేలు జాతి పశువులకు సంక్రమిస్తాయని చెప్పారు. డివిజన్‌లోరైతు సేవాకేంద్రం ద్వారా 360 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

బాధితునికి ఆర్థికసాయం

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గార మండలం బందరువానిపేటలో బుధవారం జరిగిన బోటు ప్రమాదంలో మరణించిన బడి గజేంద్ర కుటుంబానికి రూ.పదివేలు తక్షణ సాయంగా ఎమ్మెల్యే గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల పాలిటి పెన్నిధిని, కష్టం ఎక్కడుంటే అక్కడ ప్రభుత్వం నిలబడుతుందన్నారు. బోటు ప్రమాద కుటుంబానికి భరోసాగా నిలుస్తూ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సమాచార మందించి ప్రభుత్వం నుంచి కూడా సాయమందించేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, స్థానికులు, మహిళా నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బూర్జ: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి కో-ఆర్డినేటర్ జె. చిరంజీవి తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని, అలాగే అవసరమైన వారికి ఇసిజి టు డీకో వంటి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి మందులు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ఇచ్ఛాపురం : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పరిశుభ్రత వల్ల వ్యాధులు దూరమవుతాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర కుమార్ అన్నారు. పంజా వీధిలోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్ వాష్ ప్రభావం గురించి గురువారం అవగాహన కల్పించారు. పురపాలక సంఘం పరిధిలోని చక్రపాణి వీధి, మెయిన్ రోడ్డు మురుగు కాలువలు శుభ్రం చేయించారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కాలానుగుణంగా విద్యలో మార్పులు తప్పనిసరని, కళాశాలల్లో పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన ప్రొ. పి.అప్పారావు అన్నారు. నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ కణితి శ్రీరాములు అధ్యక్షతన గురువారం సెంటరాఫ్ అప్లైడ్ సైన్సెస్ ఆధ్వర్యంలో పాపులర్ లెక్చర్ సిరీస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యలో పరిశోధన, నూతన అవిష్కరణలు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం సైన్స్‌లో అనేక మార్పులు వస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు చేరువ కావాలంటే ఖచ్చితంగా నైపుణ్యాలు అవసరంగా చెప్పారు. విద్యార్థులు ఎంట్రప్రన్యూర్‌లుగా మారాలన్నారు. కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు, విద్యార్థుల్లో స్కిల్స్ పెంపొందించేలా కొత్త అంశాలు సిలబస్‌లో చేరాలని చెప్పారు. సైన్స్ విద్యార్థులు విజ్ఞా నాన్ని పంచుకొని పరిశోధనలు చేయాలని చెప్పారు. కేన్సర్ వంటి రోగాలు ప్రస్తుతం పెరగటానికి ప్రధాన కారణం జీవన శైలిలో మార్పులుగా తెలిపారు. విద్యార్థుల పరిశోధనలు ఆదర్శ సమాజం, ఆరోగ్య సమాజం లక్ష్యంగా ముందుకు సాగాలని వివరించారు. కార్యక్రమంలో చెన్నై ఐఐటి ప్రొఫెసర్ రాయల సురేష్ కుమార్, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

ఇచ్ఛాపురం : గ్రామస్తులతో మాట్లాడుతున్న విజయ

ఏపీ సూపర్ సిక్స్ పథకాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఎన్నికలు ముందు ప్రజలను మభ్యపెట్టి సూపర్ సిక్స్ పథకాలు అంటూ ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం, అధికారంలో వచ్చిన తర్వాత పథకాలు లేవు పంపిణీ లేవని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విమర్శించారు. మండలంలోని కొఠారిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ మేరకు గడప గడపకు వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మోసం గురుంచి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, వైస్ ఎంపిపి దువ్వు వివేకానందరెడ్డి, మాజీ ఎంపిపి కారింగి మోహనరావు, వైసిపి మండల అధ్యఓఉలు పాతిర్ల రాజశేఖర్‌రెడ్డి, యువజన సంఘ అధ్యక్షులు నర్తు ప్రేమ్‌కుమార్, సెల్లా దేవరాజు, సర్పంచ్ ధనలక్ష్మి, కొచెర్ల మాధవరావు, బుడ్డెపు పోలయ్య, బుడ్డెపు దుర్యోధన, శ్రీరామ్ పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంట, పోతయ్యవలస గ్రామాల్లో ఎంపిపి ఆరంగి మురళి ఆధ్వర్యాన బాబు ష్యూరిటీ -మోసం గ్యారింటీ కార్యక్రమం నిర్వహించారు.

రణస్థలం: మండలంలోని కొవ్వాడ, మత్స్యలేశం గ్రామాల్లో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసిపి రణస్థలం మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు నిర్వహించారు. ముందుగా స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం నేరుగా ప్రజల వద్దకు వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, ఎచ్చెర్ల నియోజక వర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు నేతల కృష్ణ, సర్పంచ్‌లు అల్లిపల్లి అప్పన్న, గొర్లె రాధాకృష్ణ, జక్కంపూడి అచ్చిబాబు, పిల్ల తాత, చీకటి ఎర్రయ్య, ఎంపిటిసి ఉప్పాడ అప్పన్న, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, నాయకులు మహంతి వెంకటప్పల నాయుడు, అల్లిపల్లి రాముడు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పిఎం సూర్యఘర్‌తో ప్రయోజనం

నరసింహులు

టెక్కలి రూరల్ : ప్రభుత్వ పిఎం సూర్యఘర్ యోజన కింద సబ్సిడీతో సోలార్ విద్యుత్ వినియోగదారులకు అందజేస్తుందని విద్యుత్‌శాఖ ఇఇ ఇ.నరసింహులు అన్నారు. గురువారం ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీతో త్రీ కిలో వాట్స్ వరకు గృహ వినియోగదారులు సోలార్ సబ్సిడీని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. డివిజన్‌లో ఇంతవరకు 1650 మంది దరఖాస్తు చేసుకున్నారని, దానిలో 664 మందికి సోలార్ ప్లేట్లను బిగించామని అన్నారు. సోలార్ ఎలక్ట్రికల్ గ్రిడ్‌కి వెళ్తూ బిల్లును సరి సమానం చేస్తుందని చెప్పారు. దీని ద్వారా ఆ ప్రాంతంలో ఉండే అధిక లోడు సమస్యను నివారించవచ్చని చెప్పారు. సోలార్ రూఫ్ టాప్ గరిష్ట కాలపరిమితి 25 ఏళ్లు ఉంటుందని అన్నారు. రైతులకు మోటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో బంజరు భూమి ఉంటే విద్యుత్‌శాఖ అక్కడ సోలార్ గ్రిట్స్ ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్ అందజేస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు వన్ కెవికి 5000 చొప్పున చెల్లిస్తే చాలని, మిగతా సొమ్ము బ్యాంకులో లోన్ ఇస్తాయని తెలి పారు. మిగతా ప్రభుత్వమే సబ్సిడీ అందిస్తుందని అన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న గోవిందరావు

కెజిబివి పరిశీలన

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని వసప వద్ద ఉన్న కెజిబిని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ బి.గోవిందరావు గురువారం సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న ఆహారం సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు నివేదిక అందజేశామని తెలిపారు. ఇటీవల మండల పరిషత్ మండల సమావేశంలో కెజిబివి ప్రత్యేక అధికారిని రాధికపై సభ్యులు ఫిర్యాదు చేశారు. రేషన్ బియ్యం పక్కదారి పడుతుందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎంఇఒలు ఎ.గోవిందరావు, ఎన్.శ్రీనివాసరావులు ఈ నెల 21న ఆమెకు షోకాజ్ నోటీసులు అందించారు.

పోరాట యోధుడు అచ్యుతానందన్

ఎచ్చెర్ల : నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కార్మిక, కర్షక పేదల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహోన్నత పోరాట యోధుడు అచ్యుతానందన్ అని, ఆయన మరణించడం కార్మిక పోరాటాలకు తీరనిలోటని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ అన్నారు. కేరళ మాజీ సిఎం వి.ఎస్. అచ్యుతానందన్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ సంతాప సభను అరిణామ అక్కివలస వద్ద గల శ్యాంపిస్టన్స్ ప్లాంట్-3 పరిశ్రమ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ పోరాట యోధుడు విఎస్ అచ్యుతానందన్ జన హృదయ నేతగా చరిత్రలో చిరకాలం నిలిచిపోతారని అన్నారు. పేద కుటుంబంలో జన్మించిన అయన చిన్నతనంలోనే తల్లిదండ్రులు చనిపోవడం, ఏడో తరగతిలో చదువు మానేసి, టైలరింగ్ సహ కార్మికుడిగా తర్వాత కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసి అక్కడే తనతోటి వారు పడుతున్న బాధలను చూసి, తాను స్వయంగా అనుభవించిన ఆయన కార్మిక సంఘం ఏర్పాటు చేసి చురుకుగా పనిచేశారన్నారు. కార్మిక, వ్యవసాయ కార్మిక నాయకుడుగా కష్టజీవుల కోసం కృషి చేశారన్నారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు కేరళ విపక్ష నేతగా, కేరళ సిఎంగా పాలన అందించారన్నారు. కార్యక్రమంలో ఎం.ఆశోక్, ఎల్.నాగరాజు, జె.సురేష్, ఎం.సునీల్, పి.శ్రీను, కృష్ణారావు, ఎస్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పలాస: సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్. అచ్యుతానందన్ ఆశ సాధనకు కృషి చేయడం ద్వారానే ఆయనకు ఘనమైన నివాళ్లర్పించిన వారమవుతామని వక్తలు అన్నారు. కాశీబుగ్గ సిపిఎం కార్యాలయంలో గురువారం అచ్యుతానందన్ సంతాపసభ నిర్వహించారు. ముందుగా ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సిపిఎం నాయకులు ఎన్.గణపతి అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బత్తిని ప్రసాద్, తెప్పల రాజు జుత్తు లోకనాథం, జుత్తు రాజారావు, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

పలాస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

యువతి అదృశ్యం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి పరసాన ఉషారాణి అదృశ్యమైనట్టు తల్లి లీలాకుమారి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ జి. లక్ష్మణరావు తెలిపారు. విజయనగరంలో ఉద్యోగానికి వెళ్తున్నట్టు జూలై 15న ఇంటి వద్ద చెప్పి వెళ్లి ఇప్పటికీ రాకపోవడంతో తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్న కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కొత్తకుంకాం పంచాయతీ కొండకుంకాం గ్రామానికి చెందిన సలాదుల నీలిమకు విశాఖపట్నం మధురవాడకు చెందిన జగదీష్ కుమార్‌తో గత కొన్నాళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల భర్త చెడు వ్యసనాలకు బానిసై వరకట్నం వేధింపులు చేయడంతో బాధిత భార్య నీలిమ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు హెచ్‌సి జోగరావు తెలిపారు.

సుబ్బారావు పాణిగ్రహి సతీమణి మృతి


సురేఖ పాణిగ్రహి (ఫైల్)

పలాస: మండలంలోని బొడ్డపాడుకు ఒక చేతితో పెన్ను, మరో చేతితో గన్ను పట్టిన విప్లవకవి, శ్రీకాకుళం సాయుధ విప్లవ పోరాట యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి సతీమణి సురేఖ పాణిగ్రహి (83) గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. సుబ్బారావు పాణిగ్రాహి శ్రీకాకుళం సాయిధ పోరాటంలో కథన రంగంలో నిలబడ్డారు. ఆమె విప్లవోద్యమంలో పాల్గొనక పోయినా పూర్తి సహకారం అందించారు. ఆమె పీడిత ప్రజలను ప్రేమించింది. విప్లవంపై అకుంఠిత విశ్వాసంతో ఆమె ఉండేవారు. తన భర్తతో పాటు వందలాది మంది అమరత్వం చెందినప్పుడు ఆమె ఈ త్యాగాలు వృథా కావని నమ్మారు. ఆమె మృతిపై సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్, ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు తమ సంతాపాన్ని ప్రకటించారు.

వివరాలు వెల్లడిస్తున్న సిఐ చిన్నంనాయుడు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6.600 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద ప్రశాంత్ కుమార్ పాడి, కందుల పూర్ణచంద్ర సేనాపతి బైక్ గంజాయిని తరలిస్తున్నారని అన్నారు. వారి వద్దన ఉన్న బ్యాగ్‌ను పరిశీలించి గంజాయి దొరిగిందన్నారు. ఒడిశా రాష్ట్రం కందమాల్ జిల్లా టికాబలిల నుంచి తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని ముగ్గురికి గాయాలు

కవిటి: ఆగిఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టిన సంఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. స్థానికులు అందించిన సమాచారం మేరకు... మండలంలోని బొరివంకలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఆగిఉన్న ట్రాక్టర్ ను సోంపేట నుంచి వస్తున్న కపాసుకుద్దికు చెందిన వంక రాజు, కర్రి రాజు, కర్రి మేఘనాథ్ బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వెంటనే స్పందించిన స్థానికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రులను సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు స్థానికులు తెలిపారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్టు

ఆమదాలవలస: పురపాలక సంఘంలోని 15వ వార్డు పరిధిలోని గణేష్ నగర్‌కు చెందిన సంపదరావు సరళ అనే మహిళ 17 మద్యం బాటిళ్లతో అరెస్ట్ అయినట్లు ఎస్ఐ సీపాన కాంతారావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు గురువారం అందిన సమాచారం మేరకు గణేష్ నగర్‌లోని సరళ ఇంటి దగ్గర పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వచేసిన 17 మద్యం బాటిళ్లతో ఆమెను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కాంతారావు తెలిపారు.

పాఠశాల సందర్శన

నరసన్నపేట: పాఠశాలలో పరిశరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఇఒ-2 దాలినాయడు సూచించారు. స్థానిక వంశధార కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం ప్రకారం అమలుచేయాలని ఆదేశించారు. విద్యార్థులు హాజరు, బోధనా పద్ధతులు పరిశీలించారు. ఈయనతో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఉన్నతాధికారులు

స్వర్ణాంధ్ర లక్ష్యసాధన వేగం అందుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన 'స్వర్ణాంధ్ర లక్ష్యాలు' సాధన దిశగా అధికారులు మరింత చురుగ్గా పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. పి-4 యాప్ వినియోగం, బంగారు కుటుంబాల గుర్తింపు, మార్గదర్శుల ఎంపిక, ఆర్‌టిజిఎస్ సేవలు, గ్యాస్, విద్యుత్ పంపిణీ వ్యవస్థల్లో ఉన్న సమస్యలు వంటి అంశాలపై గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు.

కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో చేపడుతున్న చర్యల వివరాలను కలెక్టర్ వివరించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సిఎస్ స్పష్టం చేశారు. డాక్యుమెంట్ల అప్‌లోడ్ ప్రక్రియను వేగవం తం చేయడం, గృహ నిర్మాణం, ఇసుక సరఫరా తదితర అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, సిపిఒ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్ తనిఖీలు

రణస్థలం: ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారం, ఎస్‌ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలు, కళాశాలలు, సినిమా థియేటర్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులు, అనుమానం ఉన్న గృహాల్లో తనిఖీలు నిర్వహించారు. గతంలో గంజాయి సేవిస్తు, గంజాయి అమ్ముతూ పట్టుబడిన ప్రదేశాల్లో, ఖాళీ స్థలాల్లో డాగ్‌స్క్వాడ్‌తో ఈ తనిఖీలు నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు. గంజాయి అమ్ముతున్నా, సేవిస్తున్నట్టు తెలిసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రణస్థలంలో ఇంతకు ముందు ఎప్పుడూ డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టలేదు ఇదే మొదటిసారి కావడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందారు. ఈ తనిఖీల్లో పిసి రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అభినందించిన రైతులు

లావేరు: మండలంలోని మద్దువలస తోటపల్లి ఫేజ్-2 పనులకు నిధులు మంజూరు కోసం ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఇఆర్ బుధవారం సిఎం చంద్రబాబుని కలిసి సానుకూలంగా స్పందించిన సిఎం త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడంతో లావేరు మండలం పైడయ్యవలస రైతులు, కూటమి నాయకులు గురువారం లావేరు టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్ అధ్యర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, ప్రజల ప్రయోజనార్థం ఎమ్మెల్యే నిరంతరం శ్రమించడం, సమయస్ఫూర్తిగా వ్యవహరించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రైతులు పళ్లంట్ల చిట్టిబాబు, కోలా నారాయణరావు, వండాన సత్యం నాయుడు, శెటికం వెంకటరమణ. పతివాడ అప్పలనాయుడు, దన్నాన స్వామినాయుడు, నాయకులు ఉన్నారు.

రహదారిపై వాహనాలు నిలిపితే చర్యలు

ఆమదాలవలస: పట్టణంలోని ప్రధాన రహదారితో పాటు రద్దీగా ఉండే రహదారుల్లో అడ్డంగా వాహనాలు నిలిపే వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ సీపాన కాంతారావు తెలిపారు. గురువారం ప్రధాన రహదారిలో పలుషాపుల వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను గుర్తించి వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు ఇకపై ఇలా ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాంతారావు మాట్లాడుతూ పట్టణంలో రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో కొన్ని సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుందని రోడ్డుపై వాహనాలు అడ్డంగా ఉండడం వలన పట్టణంలో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. షాపుల యజమానులు ప్రత్యేక దృష్టి పెట్టి వాహనాలు సక్రమంగా పార్కింగ్ చేసే విధంగా చూడాలన్నారు. రహదారిపై తోపుడు బండ్లు వ్యాపారులు రోడ్లపై కాకుండా ఫుట్ పాత్‌పై ఉండే విధంగా ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులకు సహకరించాలన్నారు. పోలీస్ సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలు, తోపుడు బండ్లపై ట్రాఫిక్ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

ఉపాధ్యాయుని కుటుంబాన్ని ఆదుకోవాలి

ఆమదాలవలస: ఎంటిఎస్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ బుధవారం రాత్రి తీవ్ర ఒత్తిడికి గురై మరణించిన అల్లు రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పైడి రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జలుమూరు మండలంలోని శ్రీముఖలింగం పాఠశాలలో ఎంటిఎస్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కంచిలి మండలం జి. ముకుంధపురం పాఠశాలకు బలవంతంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు రాజు దూర ప్రాంతానికి బదిలీ కావడంతోనే మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మరణించారని అన్నారు. కేవలం మినిమం టైం స్కేల్ జీతంతో నెట్టుకొస్తున్న ఎంటిఎస్ ఉపాధ్యాయులకు 62 సంవత్సరాల సర్వీసు 12 నెలలు జీతం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. 2023 ఏప్రిల్ 13న విధుల్లో చేరిన రాజు మాస్టర్ అర్ధాంతరంగా అకాల మరణం చెందడంతో వారి కుటుంబం రోడ్డున పడిందని ఆ కుటుంబానికి దిక్కెవరని అన్నారు. ప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రతినెలా కనీసం రూ.20 వేలు పెన్షన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీకాకుళం సిటీ: రాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు డిమాండ్ చేశారు. ఎంటిఎస్ ఉపాధ్యాయుడు రాజు మాస్టర్ మృతికి సంతాపం ప్రకటిస్తూ ప్రకటన విడుదల చేశారు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బూర్జ: ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని ప్రైవేట్ డీలర్లను హెచ్చరించారు. గురువారం మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ శాఖ అధికారి డి.ఉషారాణితో పాటు డిప్యూటీ తహశీల్దార్ సత్యవతి విస్తృతంగా తనిఖీలను చేపట్టారు. ఎరువుల డీలర్లు ఇదే అదునుగా ఎరువులను కృత్రిమ కొరత సృష్టించడం లేదా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడమే కాకుండా చర్యలు కూడా కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న ఎరువుల దుకాణాల రికార్డులను, స్టాక్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే అక్కడికి వచ్చిన రైతులకు డీలర్లు అమ్ముతున్న ధరలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

ఆమదాలవలస: సచివాలయ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అన్నారు. గురువారం పురపాలక సంఘంలోని 20వ వార్డు వెంగళరావు కాలనీలో ఉన్న సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. సచివాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారికి అందుతున్న ప్రభుత్వ సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలి

నరసన్నపేట : ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను నిలుపుదల చేయాలని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్ అదికారులను కోరారు. సారవకోట మండలం మదనాపురంలో హరిజన వీధికి వెళ్లేందుకు ఉన్న రోడ్డు మార్గం స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించి నిర్మాణం చెపడుతున్నారని అన్నారు. హరిజన వీధి జనసైనికులు ప్రజలు విషయాన్ని గురువారం అతను వద్దకు తీసుకొచ్చారని అన్నారు. వెంటనే స్పందించి సంబంధిత పంచాయతీ సెక్రటరీకి ఈ విషయాన్ని తెలియజేశానని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు.

ఎమ్మెల్యే కుమార్తెకు గ్రాడ్యుయేషన్ పట్టా

ఆమదాలవలస: ఎమ్మెల్యే కూన రవికుమార్ చిన్న కుమార్తె రేష్మ యునైటెడ్ కింగ్‌డమ్ దేశంలో గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. ఆ దేశంలోని వార్విక్ యూనివర్సిటీలో విద్యను అభ్యసించిన రేష్మ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. గురువారం యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమానికి రేష్మ తండ్రి, ఎమ్మెల్యే రవికుమార్ హాజరై పట్టా తీసుకున్న కుమార్తెకు అభినందనలు తెలిపారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

లావేరు: ఇంటింటా పోస్టర్లు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

శ్రీకాకుళం రూరల్: గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా గురువారం గార మండలం, కళింగపట్నం 67వ బూత్ వమరవల్లి, తోనంగి గ్రామాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ ఇంటింటికీ వెళ్లి, ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. సమస్యలను అడిగి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో, లేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, ఎటువంటి సమస్యనైనా తనకు తెలియజేస్తే సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అధికారులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని తామాడలో సుపరిపాలనలో తొలి అడుగులో తామాడ మాజీ సర్పంచ్, ఎచ్చెర్ల బిసిసెల్ అధ్యక్షుడు గొర్లె శ్రీనువాసరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు గొర్లె ఆదినారాయణ, బూత్ కన్వీనర్ మాడుగుల దుర్గాప్రసాద్, జి.మాధవరావు, ఎం.సురేష్, బి.శ్రీరాములు, ఆర్.లక్ష్మణరావు, కీర్తి సత్తిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా టిడిపి నాయకులు వడ్డాది భోగరాజు ఇంటింటా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బొంబాయి శ్రీను, మండల టిడిపి కార్యదర్శి, బూత్‌కమిటీ సభ్యులు, కన్వీనర్ సూరి, అనంతగిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, త్వరలో అమలు చేయబోయే పథకాల వివరాలు వివరించారు. గత ప్రభుత్వంలో జరిగిన నష్టాలు తెలియజేస్తూ ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ పిరియా సత్యం బెందాళం కింగ్, బెందాళం ఝాన్సీ, బండారు మిన్నారావు, బదకల ప్రసాద్, బదకల ఎర్రయ్య, బల్లెడ మన్మథరావు, పండి విజయ్‌కుమార్, బదకల బంగారమ్మ, యాంద్రాపు మమత, బండారు శారద, బోరుపద్ర మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

మెళియాపుట్టి : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అనురాధ

ప్రజాశక్తి- లావేరు

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి గురువారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణ జూలై 24 1890లో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా బిక్కవోలు మండలంలో జన్మించారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేశారు. గ్రంథాలయ ఉద్యమకారుడుగా, గ్రంథాలయ పితామహుడుగా పేరుగాంచారన్నారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పి.సూర్యనారాయణకు ప్రథమ, ఎస్.నీలిమకు ద్వితీయ, కె.నాగరాజుకు తృతీయ బహుమతి రాగా గ్రంథాలయాధికారి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మెళియాపుట్టిలోని స్థానిక శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి ఆర్.అనురాధ పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయ పితామహులని తెలుగు భాషా అభివృద్ధికి ఎంతో సేవచేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన 'తెలుగు విజ్ఞాన సమితి' స్థాపనలో కీలక పాత్ర పోషించారని అన్నారు. తెలుగు సాహిత్యంపై ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నీలిమ, స్వాతి, పలువురు విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు కె.రామకష్ణ, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

టెక్కలి రూరల్ : ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరావు

సోంపేట : మండలంలోని పోత్తంగికి చెందిన కాసి మోహనరావు కుటుంబానికి మాకన్నపురం ఎఎన్ఆర్ సేవా సంఘం ఆర్థికసాయం అందజేశారు. మృతుడి భార్య జయకు రూ.35,116 అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావు, సభ్యులు బతకల దీర్ఘారావు, మద్దిల అప్పయ్య, కడగల హేమసుందరరావు, కొండే కృష్ణారావు, బంగారు దేవేంద్ర, బొండాడ రామారావు పాల్గొన్నారు.

సోంపేట పట్టణంలోని బాప్టిస్ట్ చర్చిలో బిషప్ రెవ డాక్టర్ కొత్తపల్లి అబ్రహం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైసిపి రాష్ట్ర క్రిష్టియన్ సెల్ జనరల్ సెక్రటరీ ప్రత్తి అన్వేష్ పాల్గొని, ప్రత్తి విజయకుమార్ పాల్గొన్నారు. కిడ్నీ రోగికి విజయ్‌కుమార్, అబ్రం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్ భీమ్ బెహర్, ఆనంద్, కిరణ్, శేఖర్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ ఆదిఆంధ్రా వీధిలో చెందిన దేవాది శ్రీనివాసరావు రైల్వే గేట్ సమీపంలో తోపుడు బండిపై పళ్ల అమ్ముకుంటూ జీవనం గడిపేవాడు. ఆయన వెన్నుపూసపై కాయ ఏర్పడి అత్యవసర పరిస్థితుల్లో ఆపరేషన్ చేయించారు. నాలుగు నెలలుగా ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. విషయం తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం సభ్యులు రూ.పది వేలు ఆర్థికసాయం గురువారం అందజేశామని సంఘ అధ్యక్షులు డి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.సింహాచలం, పిల్లల రమేష్, ధర్మవరపు పూర్ణాచారి, ఉంగరాల గోవిందరావు, జోగి ఆదినారాయణ, పినిమింటి రామారావు, దాసరి వైకుంఠరావు, దేవాది సత్యం పాల్గొన్నారు.

సన్మానిస్తున్న హెచ్ఎం కాంతారావు

సేవలతోనే గుర్తింపు

వజ్రపుకొత్తూరు: చేసిన సేవలతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.కాంతారావు అన్నారు. ఇటీవల బదిలీపై వేరే పాఠశాలలకు వెళ్లిన లకినాన మాధవరావు, ఎం.వెంకటరావులకు సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల క్రమశిక్షణకు పాటుపడ్డారని అన్నారు. ఎస్ఎంసి చైర్‌పర్సన్ దున్న కవితారమేష్‌లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలకు గ్రామస్తుల అండతో మేము పూర్తిస్థాయి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుంట కోదండరావు, కె.మాధవరావు, బి. అన్నపూర్ణ, ఎం.హరినాథ్, ఎస్.విష్ణుమూర్తి, ఎస్.పాపారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి ఉపకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎఇ జి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 33 కెవి లైన్‌లో పోల్స్ మార్చడం, అక్కుపల్లి సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కారణంగా అక్కుపల్లి, గరుడభద్ర, రాజాం, మెట్టూరు, బాతుపురం పరిసర గ్రామాలకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

పలాస : కాశీబుగ్గ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రి ఫీడర్, పాత స్తంభాల మార్పిడి, లైన్ల మార్పు చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యో.. ఎంత కష్టం

- కాలేయ వ్యాధితో బాధపడుతున్న భీముడు
- దాతల సాయం కోసం ఎదురుచూపులు

వేడుకుంటున్న దేవకి

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల కుమార్తె చనిపోయిన బాధలో ఉన్న ఆ కుటుంబానికి అనుకొని ఆపద ఎదురైంది. రోజువారి పనులు చేసుకుంటూ భార్య, బిడ్డని పోషించుకుంటున్న అతనికి కాలేయ వ్యాధి కాటేసింది. అకస్మాత్తుగా బయటపడిన ఈ వ్యాధితో ఆ కుటుంబం ప్రస్తుతం రోడ్డున పడింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని మాణిక్యపురానికి చెందిన రామిశెట్టి భీముడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో వైద్యులను సంప్రదిస్తే కాలేయ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిపారు. దానికి తోడు జాండీస్ కూడా ఉన్నట్టు స్పష్టం చేశారు. వైద్యం కోసం లక్షల్లో ఖర్చవుతుందని తెలిపారు. దీంతో తమకు తోచిన వారి వద్ద అప్పు చేసి, ఉన్న వస్తువులు అమ్మేసి సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చు చేశారు. అయినా ఇంకా డబ్బులు అవసరం కావడంతో ప్రస్తుతం భీముడు భార్య దేవకి దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది.

రెక్కాడితే గాని డొక్కాడని తమకు ప్రస్తుతానికి దాతలే దిక్కని, మానవతా దృక్పథంతో తన భర్తకు ప్రాణభిక్ష పెట్టాలని దేవకి చెమ్మగిల్లిన కళ్లతో వేడుకుంటోంది. సాయం అందించే దాతలు ఈ 8886732810 ఫోన్ పే నంబరుకు సాయం అందించాలని ప్రాధేయపడుతోంది.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ప్రభుత్వ విప్ అశోక్

మాట్లాడుతున్న విప్ అశోక్

సోంపేట: ప్రకృతి వ్యవసాయం సాగు పద్ధతులు అవలంబించేలా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై వ్యవసాయ ఉద్యాన సహాయకులకు అందించే మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకరరావు ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల శిక్షకులు గోవిందరెడ్డి, సంజీవ్, నాలుగు మండలాల ఎంఒలు పాల్గొన్నారు.

జీడి మొక్కల పంపిణీ

మండలంలోని బారువాలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఉద్యానవన రైతులకు గురువారం జీడి మొక్కలు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి, మామిడి విస్తరణ పథకంలో భాగంగా రైతులకు వీటిని అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహకారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉద్యానవన శాఖాధికారిని మాధవీలత మాట్లాడుతూ అంతర పంటలుగా వేసుకునే రైతులకు ఎకరాకు 20 మొక్కలు, పూర్తిస్థాయిలో పంట వేసుకున్న రైతులకు ఎకరాకు 80 మొక్కలను అందిస్తున్నామని తెలిపారు. ముందుగా నమోదు చేసుకున్న జాబితా ప్రాప్తికి మొక్కలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సోంపేట, కవిటి, కంచిలి ఇచ్ఛాపురం మండలాలకు సంబంధించి 11 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టి.బాలరాజు, శంకర్, చంద్రమోహన్, మడ్డు కుమార్ పాల్గొన్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ

పొందూరు : మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

నరసన్నపేట : మాట్లాడుతున్న ఎఎస్ఐ తులసీనాయుడు

ప్రజాశక్తి- పొందూరు

శక్తియాప్ మహిళలకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని ఆమదాలవలస సిఐ పి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని బాణాంలో గురువారం నారీశక్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి మహిళ తప్పనిసరిగా శక్తియాప్‌ను అప్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈయనతో పాటు ఎస్ఐ వి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

మండలంలోని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శక్తిటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మానవ అక్రమ రవాణా, మహిళలపై వేధింపులు, పలు టోల్‌ఫ్రీ నెంబర్లపై విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ రమణమూర్తి, ప్రిన్సిపాల్ జె.సునీత, శక్తిటీం సిబ్బంది మోహనరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోషే, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అప్రమత్తం

నరసన్నపేట: ప్రస్తుత సమాజంలో బాలికల సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి దానికీ స్పందించకుండా మంచి ఏదో, చేడు ఏదో తెలుసుకుని అప్రమత్తంగా ఉండాలని ఎఎస్ఐ బి.తులసీనాయిడు సూచించారు. నరసన్నపేట డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శాంతి హేమ అధ్యక్షతన పోలీస్ విభాగం సౌజన్యంతో నారీశక్తి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఫేస్‌బుక్, వాట్స్‌యాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాలో వచ్చిన ప్రతి దానికీ స్పందించకూడదని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 112కి, బాల్య వివాహాలు నియంత్రణకు 1098, సైబర్ క్రైమ్ అయితే 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రిన్సిపాల్ శాంతిహేమ మాట్లాడుతూ సమాజంలో సామాజిక మాధ్యమాలు వల్ల మంచితో పాటు చెడు కూడా వ్యాపిస్తుందని అన్నారు. వీటివల్ల బాలికలపై లైంగిక వేధింపులు, ఫొటో మార్ఫింగ్‌లు, బ్లాక్ మెయిలింగ్ ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి తరుణంలో మహిళలు తమకు తాను కాపాడుకునే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, అన్నాజీరావు, ఢిల్లీశ్వరరావు, త్రినాథరావు, పూజాభరద్వాజ్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దేవేంద్రరెడ్డి

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ఇచ్ఛాపురం : ఎయిడ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వాస్పత్రి ప్రధాన వైద్యాధికారి దేవేంద్రరెడ్డి అన్నారు. వైసిబి ప్రెవెన్షన్ యూనిట్ ట్రేకర్స్ ఆధ్వర్యాన ఎయిడ్స్ నియంత్రణపై సూర్యకుమారి కళాజాతర బృందం వారిచే స్వర్ణభారతి డిగ్రీ కాలేజ్, స్థానిక బస్టాండ్ వద్ద గురువారం కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై వివక్షత చూపరాదన్నారు. స్వర్ణభారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, కౌన్సెలర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ సందీప్, జయప్రకాష్, ప్రాజెక్టు మేనేజర్ మాధవరావు, రవికుమార్, ఎఎన్ఎం జయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజా కవి జాషువా

పలాస : రాజు మరణిస్తే శిలా విగ్రహాలుగా మిగిలిపోతాడని, అదే ప్రజాకవి మరణిస్తే శాశ్వతంగా ప్రజా నాలుకలపై జీవిస్తూనే ఉంటాడని ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక, జన జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు, కవులు, కళాకారులు అన్నారు. కాశీబుగ్గలో డాక్టర్ తెప్పల కృష్ణమూర్తి అధ్యక్షతన గుర్రం జాషువా వర్ధంతి సందర్భం వేడుకలు గురువారం నిర్వహించారు. ముందుగా జాషువ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కళాకారులు, జాతీయ అంతర్జాతీయ కళా అభిమానులు లండ రుద్రమూర్తి, హనుమంతు మురళీమోహన్, కాళిదాసు, డాక్టర్ కుమార్‌నాయక్, సీనియర్ జర్నలిస్టు వంకల రాజారావు నిషిదాసి, శివజ్యోతి మాట్లాడారు. మహాకవి గుర్రం జాషువా గబ్బిలం కవిత సంపుటి ద్వారా అంటరానితనాన్ని ఎండగట్టారని అన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రాజకీయ నాయకుల శిలా విగ్రహాలు తప్ప మహా కవుల, చరిత్రను సృష్టించిన మహానుభావుల విగ్రహాలు కనిపించడం లేదని అన్నారు. తెలుగు భాషను నిర్బంధ విద్యగా అమలు చేయాలని పలువురు కోరారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

టెక్కలి రూరల్ : మండలంలోని సీతాపురంలో గురువారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన వైద్యులు కావ్య, రామారావు 52 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 22 మందికి నేత్ర ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి తంటు జగ్గారావు, ఎంపిటిసి బెండి దేవాయని, బోగిరి వెంకటరావు, విశ్రాంత ఎంఇఒ బెండి అప్పల సూర్యనారాయణ, సిపాన వెంకటరావు, కోరాడ రాంప్రసాద్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం

కొత్తూరు: స్థానిక సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వైశ్యరాజు శ్రావణ్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ దివాకర్‌లు ఐదేళ్లుగా పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయ్యారు. వీరికి వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు, ఎంపిడిఒ నీరజ, సర్పంచ్ పడాల కృష్ణవేణిలు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్ల పని చేసిన విధంగా బదిలీపై వెళ్లిన స్థానాల్లోనూ అదే అదేవిధంగా పనిచేసి ప్రజలు మనలలను పొందాలన్నారు.

నరసింహులుకి సన్మానం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ముత్యాలమ్మ వాకర్స్ క్లబ్ మెంబర్ దడియాల నరసింహులును సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యునిగా నరసింహులును నియమించడంతో ఆయనకు వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ రాజేంద్ర, సభ్యులు హనుమంతు మురళీమోహన్, రాజారావు, రామ్మోహనరావు పాల్గొన్నారు. ఆయనతో పాటు సవర రాంబాబు కూడా నియమించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

బూర్జ: అనధికారికంగా ఎక్కడైనా, ఎవరైనా మద్యం విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎస్ఐ ప్రవల్లిక హెచ్చరించారు. గురువారం మండలంలోని రాజుపేటలో నాకాబంది నిర్వహించారు. ఎవరైనా దొంగ వాహనాలు అమ్మడం, కొనుగోలు చేయడం, వాహనానికి సంబంధించి పత్రాలు లేని వాహనాలు నడిపినా అటువంటి వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాన్ని ఇవ్వటం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ప్రతిఒక్కరు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని వివరించారు.

ఉద్యోగులను బెదిరించడం దుర్మార్గం

నరసన్నపేట: కూటమి ప్రభుత్వ నాయకులు ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించడం, దుర్భాషలాడడం, భౌతిక దాడులకు దిగడం దుర్మార్గమని వైసిపి ఉద్యోగులు, పెన్షన్లు విభాగం అధ్యక్షుడు యారబాటి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పోలీస్ అధికారిపై జెసి దివాకర్‌రెడ్డి ప్రవర్తన తీరే ఇందుకు నిదర్శనమన్నారు. ఉద్యోగులు అదనపు పనిభారంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. కూటమి నాయకుల తీరు మారకపోతే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

'పోష్'పై అవగాహన

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి మహారాజా బాలురు స్కూల్‌లో పోష్ చట్టంపై గజపతి జిల్లా న్యాయ సేవా అధికారం గురువారం అవగాహన కల్పించారు. గజపతి జిల్లా డిఎల్ఎస్ఎ కార్యదర్శి బిమల్ రౌల్ అధ్యక్షత వహించారు. అతిథులుగా జిల్లా అదనపు విద్యాధికారి ఎస్.గిరిధర్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి సల్మాన్ రైకా, మహిళలు తాము పనిచేస్తున్న స్థలాల్లో లైంగిక దాడులకు గురి కాకుండా ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని తెలిపారు. ఈ చట్టం అంటరానితనం అదుపులో భాగంగా షెడ్యూల్ తరగతులకు, షెడ్యూల్ తెగలకు రక్షణ కల్పిస్తుందని తెలిపారు. మహిళలు, సామజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, తెగలు రక్షణకు అవగాహనా కార్యక్రమాలు, బలోపేతమైన, ఆచరణాత్మక న్యాయరక్షణ కవచాలు అవసరమని తెలిపారు. బాలబాలికల సంక్షేమ కమిటీ అధ్యక్షులు అశ్వినికుమార్ మహాపాత్ర, మహారాజా బాలురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మోనాలిసా దాస్, పాల్గొన్నారు.